క్లుప్తంగా

12,300 మంది రైతుల నమోదు

దేవనకొండ: మండలంలో ఇప్పటివరకు 12,300 మంది రైతులు ఫార్మర్ యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఇంకా 5 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందన్నారు. వీలైనంత త్వరగా రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఫార్మర్ యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు నేరుగా పొందే అవకాశం ఉంటుందన్నారు.

2లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు తెలియజేసి మార్చి నెల 2వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ రవి గురువారం తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 20 ఎకరాలకు సంబంధించి ఈ-కై వేసీ చేయించామన్నారు. సమీపంలో వున్న రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి భూముల వివరాలు తెలియజేయాలని కోరారు.

పోసాని అరెస్టు అక్రమం

మద్దికెర: కూటమి ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ పోసాని కృష్ణమురళి అరెస్టు చేయడం అక్రమమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల నుంచి తప్పుకున్నానని చాలా రోజుల క్రితమే ప్రకటించినా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు చర్యలు మంచిది కాదన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుటుంబంపై కూటమి నాయకులు నిందలు వేసి ఆరోపణలు చేశారని అలాంటి వారిని కూడా అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. అప్రజాస్వామిక చర్యలు ఎల్లకాలం కొనసాగవని, త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

ఉత్సవాలకు ఆహ్వానం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, గూళ్యం ఉత్సవ కమిటీ సభ్యులు

చిప్పగిరి: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో మార్చి 4వ తేదీన జరిగే గాదిలింగేశ్వర,సిద్ధేశ్వర స్వామి జోడు రథోత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే విరూపాక్షిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రథోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరేశప్ప, కుమారస్వామి, ఎల్లప్ప, ఈరప్ప, బసవరాజు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల నిర్వహణకు టెండర్



వేలాలకు టెండర్ దాఖలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణకు గురువారం విజయవాడ స్టేట్ వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన షీల్డ్ టెండర్‌లో ఎల్లార్తి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున రూ.1.75 కోట్లకు దక్కించుకున్నాడు. రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కెర, హేర్ కటింగ్ తదితర వాటికి 11 నెలల 15 రోజుల నిర్వహణకు గాను వక్ఫ్ బోర్డు అధికారులు గురువారం ఉదయం షీల్డ్ టెండర్లు ఆహ్వానించారు. ఇందులో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పోటి పడగా అత్యధికంగా కోట్ చేసిన మల్లికార్జున దక్కించుకున్నాడు.

అమావాస్య పూజలు



ఎల్లార్తి దర్గాలో భక్తుల సందడి

హొళగుంద: మండలంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి, హొళగుంద సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. హొళగుందలోని సాయిబాబా మందిరం, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, జెండాకట్ట, హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు.

ఆర్థిక సాయం

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు గుత్తి రమేష్ ఈనెల 19న మృతి చెందాడు. గురువారం సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నిర్వాహకులు విజయ్ ప్రసాద్ మృతుడి భార్య కృష్ణవేణికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. హరీష్, విజయుడు ఉన్నారు.



తుగ్గలి: చెన్నంపల్లిలో కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం



కృష్ణగిరి: లక్కసాగరంలో ఉమామహేశ్వరస్వామి ప్రభోత్సవం



ఆలూరు రూరల్: ఆలూరు కోట వీధిలో భీమలింగేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మద్దికెర : బుగ్గ సంగమేశ్వరంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వెల్దుర్తి: చెర్లకొత్తూరులో ఫక్కీరప్పతాత రథాన్ని లాగుతున్న భక్తులు



హొళగుంద: ముద్దటమాగిలో ఉచ్ఛాయోత్సవం



దేవనకొండ: పల్లెదొడ్డిలో పార్వతి, నీలకంఠేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



మద్దికెర : ఎం.అగ్రహారంలో జనవాహిని మధ్య అవధూత కొండప్పతాత రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

సాక్షి నెట్‌వర్క్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో శివ,పార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అలాగే ఆయా ప్రాంతాల్లో సాయంత్రం ప్రభోత్సవం, ఉచ్చాయం, రథోత్సవం జరిపించారు. ఉత్సవమూర్తులను రథం, ప్రభ, ఉచ్చాయంపై అధిష్టింపజేసి విశేష పూజల అనంతరం భక్తుల హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణ గావిస్తుండగా వాటిని ముందుకు కదిలించారు. కొందరు భక్తులు రథం పై అరటి పండ్లు విసిరి భక్తి చాటుకున్నారు. కార్యక్రమాల సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



తుగ్గలి : బోడబండలో పూలజందుకున్న తిమ్మగురుడు



ఆస్పరిలో కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



ఆస్పరి: బిణిగేరిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న పండితులు



ఆస్పరి: వేడుకను తిలకిస్తున్న భక్తులు



ఆస్పరి: ఖడ్గాలు చెబుతున్న వీరభద్రస్వామి వేషధారి నాగలింగయ్యస్వామి



ఆస్పరిలో పక్కీరప్ప తాత రథాన్ని లాగుతున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బ్రహ్మేశ్వరస్వామి



నవమాంకముల నాటకంలో ఓ సీను

నేడు రథోత్సవం

వెల్దుర్తి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మగుండంలో గంగా, గౌరీ సమేత బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఉత్సవ ప్రత్యేకాధికారి హనుమంతరావ్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం కామేశ్వరీదేవి బ్రహ్మగుండేశ్వరస్వామి వారికి పారాయణం, దీక్షా హోమం అర్చకులు శివ, శ్రీధర్‌శర్మ కుటుంబీకుల ఆధ్వర్యంలో జరిగాయి. స్వామి, అమ్మవార్ల కల్యాణ కట్టడి అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌లకు చేపట్టిన ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది.

వన్స్‌మోర్ అనిపించిన నవమాంకములు..

జాగరణ సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మండల నాటక కళాకారుల బృందం వారి నవమాంకములు ఉచిత నాటక ప్రదర్శన భక్తులను కట్టిపడేసింది. కళాకారుల పద్యగానం, పాత్రల భావోద్వేగం, తదనుగుణ సంగీతం అలరించింది.

నోటీస్ బోర్డు

4న గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామి జోడు రథోత్సవాలను మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. 4న గాదిలింగేశ్వర, సిద్దేశ్వర స్వామి రథోత్సవం, 5న ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

9న మంగమ్మవ్వ రథోత్సవం

ఆలూరు: మండలంలోపి కమ్మరచేడు గ్రామంలో కొలువుదీరిన శ్రీ మంగమ్మవ్వ రథోత్సవాన్ని మార్చి 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం ఆలయ ఆవరణలో గుణపతి హోమం, అభిషకాలు,సాయింత్రం ఉచ్చాయం తదితర కార్యక్రమాలే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం



భక్తిశ్రద్ధలతో రుద్రమునిస్వామి ఆరాధన

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో రుద్రమునిస్వామి మఠంలో గురువారం సాయంత్రం ఆరాధనోత్సవాలను గ్రామస్తులు నిర్వహించారు. శివరాత్రి జాగరణ ముగించి స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా గంధం వేడుకలు

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించే దివానే మస్తాన్ వలి స్వామి 39వ ఉరుసు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు గంధాన్ని స్వామి వారి గుర్రంపై ఉంచి వీధుల్లో ఊరేగించారు. మహిళలుపెద్ద ఎత్తున తరలి వచ్చి నిండు బిందెలతో నీళ్ల పోసి,కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.



నంచర్లలో గంధాన్ని గుర్రంపై ఊరేగిస్తున్న దృశ్యం

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

ఆలూరు రూరల్: నాటుసారా తయారీ, విక్రయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం సిబ్బందితో కలిసి హొళగుంద మండలం నెరణికి గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. నాటుసారా తయారు చేసి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా సేవించడం వల్ల కలిగే అనారోగ్యాలను వివరించారు. అనంతరం అదే మండలంలోని కొత్తపేట గ్రామ శివారు కొండల్లో దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. హాలహర్వి మండలం విరుపాపురం గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకుని అతని నుంచి 58 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడుల్లో ఎస్ఐ నవీన్ బాబు, సిబ్బంది మాలవ్య, సోమేష్, విజయ్ పాల్గొన్నారు.



నెరణికి తండాలో నాటుసారా నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ లలిత

సేవల పరిశీలన

వెల్దుర్తి: రామళ్లకోట పీహెచ్‌సీ పరిధిలోని బ్రహ్మగుండం క్షేత్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని, అన్నదాన కార్యక్రమాలను గురువారం జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు పరిశీలించారు. వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచిన ముందులు, భక్తులకు అందుతున్న సేవలపై విచారించారు. అన్నదాన కార్యక్రమాలను పరిశీలించారు. దీక్షతో వచ్చిన భక్తులకు ఉచితంగా అందిస్తున్న భోజన, అల్పాహారాల వసతిపై హర్షం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి భువనతేజ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్షనిస్టు ఖలీల్ ఉన్నారు.



సూచనలిస్తున్న డాక్టర్ రఘు

- గత ప్రభుత్వ హయాంలో ఏటా రూ.10వేల సాయం
- నేడు పైసా విదల్చని కూటమి ప్రభుత్వం

దర్జీలకు 'చేదోడు' ఏదీ?

పత్తికొండ రూరల్ : దుస్తులతో అందం..హుందాతనం అందించే కళాకారులు టైలర్లు. వస్త్రానికి మంచి ఆకృతినిచ్చి మానవుడి సౌందర్యాన్ని బాహ్యప్రపంచానికి చూపించే కళాకారులకు నేడు ఆదరణ కరువైంది. రెడీమెడ్ దుస్తుల హవా పెరగడంతో దర్జీలకు పని తగ్గింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చేతి వృత్తులకు చేయూతనివ్వాలన్న బృహత్తర సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో దర్జీలకు ఏటా రూ.10వేల చొప్పున అందజేసి జగనన్న చేదోడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో దర్జీపని వదిలేసి ఇతర పనులకు వెళ్లిన వారు కూడా తిరిగి కుట్టుపనులు చేసుకుంటూ హాయిగా జీవనం కొనసాగించారు. గత ఏడాది జగనన్న చేదోడు కింద సుమారు 560 మంది వరకు ఆర్థిక సాయం అందుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేదోడు పథకానికి ఎగనామం పెట్టింది. ప్రస్తుతం వారికి రూపాయి కూడా చేయూతనివ్వడం లేదు. నేడు టైలర్స్ డే సందర్భంగా వారికి జరుగుతున్న అన్యాయంపై కథనం.

దర్జీల సంక్షేమానికి చెల్లుచీటి..

చేతి వృత్తులను వదులుకోలేక, కొత్త పనిచేయలేక సతమతమవుతున్న తరుణంలో దర్జీలకు అండగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2009 మార్చి 1వతేదీన జీవో ఎంఎస్ నంబర్ 86 విడుదల చేశారు. కేరళ, చెన్నై తరహాలో ఏపీలో కూడా టైలర్లకు సదుపాయాలు అందించాలని తలంచారు. 2009 మే 14న రాష్ట్ర ప్రభుత్వం 283బి, 12008-2 ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో దర్జీలను కోఆపరేషన్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించింది. దీంతో రాష్ట్రంలో దర్జీలకు ప్రయోజనం అందించాలని వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీవో జారీ చేసిన తరువాత రూ.కోటి నిధులు విడుదల చేశారు. ఆయన మరణానంతరం చేనేత, జౌళి శాఖకు నిధులు కేటాయించకపోవడంతో దర్జీల జీవితాల్లో మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టిన తరువాత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో ఏటా రూ.10వేలు జమ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకుడు ప్రభుత్వం వారిని ఆదుకునే చర్యలకు శుభం పలికింది. దీంతో దర్జీల కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.



పత్తికొండలో బట్టలు కుడుతున్న టైలర్లు

టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



ఎంతో మంది టైలర్ల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు. టైలర్లు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడు పథకంతో దర్జీల కొంత మేలు జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో టైలర్ల సంక్షేమానికి నిధులు కేటాయించి చేతివృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపాలి.

– బొల్లవానిపల్లె వెంకటేశ్వరరెడ్డి, నవ్యాంధ్ర టైలర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, పత్తికొండ

కష్టతరంగా కుటుంబ పోషణ



మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్లకు పనితగ్గింది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో ప్రతి ఏడాది రూ.10వేలు ఆర్థిక సాయం అందేది. ఆ మొత్తం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం మా సంక్షేమం గురించి పట్టించుకునే వారు లేరు. – రంగన్న, టైలర్, పత్తికొండ

పెంచిన కూలి రేట్ల జీవో విడుదల చేయాలి



పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ కూలి రేట్లు పెంచుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్, సీఐటీయూ నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అంతకు ముందు కామ్రేడ్ ఈశ్వరరెడ్డి భవన్ నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. 14 నెలల నుంచి కార్మికులకు వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. దస్తగిరి, హుసేన్, శ్రీనివాసులు, రాము, మల్లికార్జున, సురేంద్ర ఆచారి, కేశవులు పాల్గొన్నారు.